General Dt 10/01/14



# మెట్రోరైలు పాదయాత్ర

**నాంపల్లి నుంచి మలక్‌పేట వరకు పరిశీలన ● చాదర్‌ఘాట్‌లో రూ.5.5 కోట్లతో పాఠశాల నిర్మాణం ● హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడి**

ఈనాడు, హైదరాబాద్

కార్యాలయాల్లో ఏసీ గదులకే పరిమితం కాకుండా మెట్రో, ఎల్ అండ్ టీ అధికారులు తమ కాలికి పని చెప్పారు. ప్రధాన నగరంలో పనులు జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. నాంపల్లి హజ్‌హౌజ్ నుంచి మొదలైన కాలినడక మలక్‌పేట గంజ్ వరకు దాదాపు 5 కిలోమీటర్లపైగా కారిడార్ వెంట సాగింది. అడుగడుగునా ఎదురవుతున్న అవాంతరాలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అక్కడికక్కడే ఎల్ అండ్ టీ ఇంజినీర్లకు సూచనలు చేశారు. ట్రాఫిక్ సాఫీగా సాగకుండా రహదారిపై అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను సంబంధిత అధికారుల అనుమతితో వెంటనే తొలగించడంతో రహదారి మార్గంలో గుంతలు లేకుండా చూడాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణ చేపట్టిన చోట తిరిగి ఆక్రమణలకు గురికాకుండా వెంటనే బారికేడ్లను ఏర్పాటు చేసి పనులను ప్రారంభించాలన్నారు. వీటన్నింటిని 15 రోజుల్లోపు పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ఎన్వీఎస్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.



నాంపల్లిలో మెట్రో రైల్ పనులు పరిశీలిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

● మొజంజాహి మార్కెట్ కరాచీ బేకరి నుంచి పుత్లిబౌలి చౌరస్తా వరకు 30 స్తంభాలు వస్తాయి. ఈ మార్గంలో స్టేషన్ వస్తుంది. సాధారణంగా స్టేషన్ స్తంభాలు పది ఉంటాయి. వీటిని ఒకేసారి వేస్తుంటారు. ఇక్కడ ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తొలుత ఐదు స్తంభాలు వేసి అనంతరం మిగతా వాటిని పూర్తిచేస్తాం. నిర్మాణం పూర్తయ్యాక రెండువైపులా ట్రాఫిక్ వెళ్లేలా జాగ్రత్తలు తీసుకున్నాం.

● మూసీ నదిని దోబిఘాట్ మీదుకు మెట్రోరైల్ దాటుతుంది. ఎంజీబీఎస్ వద్ద ఇంటర్‌సెక్షన్ పాయింట్ వస్తుంది. రాష్ట్రంలోని దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే విధంగా ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నాం. పార్కింగ్ స్థలాన్ని విస్తరించనున్నాం. ఇక్కడ బ్రెయిలీ బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నాం.

● రంగమహల్ చౌరస్తా మీదుగా చాదర్‌ఘాట్ ప్రభుత్వ పాఠశాల స్థలం నుంచి మలక్‌పేట మార్గంలోకి ప్రవేశిస్తుంది. ఇప్పటికే ఇక్కడ ప్రభుత్వ పాఠశాలను కూల్చివేసి రెండు స్తంభాలు వేశాం. ఇక్కడున్న నాలుగు ప్రభుత్వ పాఠశాలను పక్కనే కొత్తగా నిర్మించిన నాలుగు అంతస్థుల భవంతిలోకి మార్చాం. నెలకు రూ.1.30 లక్షల అద్దె చెల్లిస్తున్నాం. కూల్చిన స్థలంలోనే స్థంభాల స్థలం మినహాయించి మిగతా ప్రాంతంలో నాలుగు అంతస్తుల భవనాన్ని రూ.5.5 కోట్ల వ్యయంతో నిర్మించబోతున్నాం. ఆటస్థలాన్ని కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. కూకట్‌పల్లిలోనూ ఈ తరహా పాఠశాల భవంతిని నిర్మించాం.

## నిలదీసిన స్థానికులు..

దోబిఘాట్, ప్రభుత్వ పాఠశాల కూల్చివేతపై స్థానికులు మెట్రో అధికారులను నిలదీశారు. దోబిఘాట్‌ను మరోచోట పునర్నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చినా సంతృప్తి చెందలేదు. నాలుగు పాఠశాలలను నాలుగు అంతస్తుల ప్రైవేటు భవంతిలో తరలించామని, సాధ్యమైనంత తొందరగా భవంతి నిర్మించి ఇస్తామని చెప్పినా వారు సంతృప్తి చెందలేదు. ఏదైనా సమస్య ఉంటే కలెక్టరును సంప్రదించాలని మెట్రో అధికారులు తెలిపారు.